60 డివిజన్లు.. 30 మంది వార్డు ఆఫీసర్లు

- ఉత్తర్వులు జారీ చేసిన బల్దియా కమిషనర్
- ఒక్కో వార్డు ఆఫీసర్‌కు రెండు డివిజన్ల కేటాయింపు



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ 50 డివిజన్ల నుంచి 60 డివిజన్లకు పెరిగిన నేపథ్యంలో డివిజన్లపై పర్యవేక్షణ బాధ్యతలను వార్డు ఆఫీసర్లకు అప్పగిస్తూ బల్దియా కమిషనర్(ఎఫ్‌ఏసీ) జె.అరుణశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. 60 డివిజన్లకు 30 వార్డు ఆఫీసర్లను ఎంపిక చేసిన కమిషనర్, ఒక్కో వార్డు ఆఫీసర్‌కు రెండు డివిజన్ల చొప్పున కేటాయించారు. మారిన డివిజన్లపై వార్డు ఆఫీసర్లు తికమక పడకుండా ఉండేందుకు, వారికి కేటాయించిన కొత్త డివిజన్లలో ఇంటి నంబర్లతోపాటు డివిజన్ల పరిధిలోకి వచ్చే కాలనీల పేర్లతో పొందుపర్చిన జాబితాను కూడా వార్డు ఆఫీసర్లకు అప్పగించారు.

వార్డు ఆఫీసర్ల విధులు..

పునర్విభజనతో ఏర్పడిన కొత్త 60 డివిజన్లలో వార్డు ఆఫీసర్లు చేయాల్సిన విధులను ఉత్తర్వుల్లో కమిషనర్ వివరించారు. వార్డు ఆఫీసర్లకు కేటాయించిన డివిజన్ల పరిధిలో ఆస్తి పన్నుల జాబితా రూపొందించడం, పారిశుధ్యం పనితీరు పర్యవేక్షణ, చెట్ల పెంపకంతోపాటు కనీసం 85 శాతం మొక్కల మనుగడ, నీటి సరఫరా నిర్వహణ, పార్కులు, ఆట స్థలాలు, టాయిలెట్స్, మార్కెట్ స్థలాల నిర్వహణ, అనధికార నిర్మాణాలు, అక్రమకట్టడాల కూల్చివేతలు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, మెప్మా తదితర కార్యక్రమాలను రోజూ సంబంధిత అధికారులకు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల నిర్వహణలో అలసత్వంగా ఉంటే మున్సిపల్ చట్టం ప్రకారం క్రమశిక్షణా చర్యలుంటాయని స్పష్టం చేశారు.

రోశయ్య సేవలు మరువలేనివి



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న ఎస్‌ఓటూ జీఎం

గోదావరిఖని/కోల్‌సిటీ/సుల్తానాబాద్/రామగిరి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ఒకరోజు సమ్మెతో కార్మికులకు ప్రయోజనం లేదు



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో ఈనెల 9న నిర్వహిస్తున్న ఒకరోజు సమ్మెతో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ బీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ ప్రేరేపిత సమ్మెను వ్యతిరేకిస్తూ బీఎంఎస్ దూరంగా ఉంటుందన్నారు. సింగరేణిలో కొత్త మైన్స్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల సంగతేంటి అని ప్రశ్నించారు. గుర్తింపు సంఘాలు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మిక హక్కుల సాధన కోసం బీఎంఎస్ ముందుంటుందన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, ప్రసాద్, కుమారస్వామి, రమేశ్, కృష్ణ, ప్రమోద్ కాసల్, నర్సయ్య, నాయక్ పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ–వన్ ఏరియాలో అధికారుల క్వార్టర్ల కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 18క్వార్టర్లకు 9మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురికి క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హన్మంతరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నివారణకు నిల్వనీటిలో ఆయిల్‌బాల్స్



ఆయిల్‌బాల్స్ వేస్తున్న బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ: నగరపాలక సంస్థలో 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అన్ని డివిజన్లలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గంగానగర్‌లో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పాల్గొన్నారు. కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఫైవింక్లయిన్ ప్రాంతంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. సమీపంలోని ఫైవింక్లయిన్ పార్క్ ప్రజామరుగు దొడ్డిలో సౌకర్యాలను పరిశీలించి ఆవరణ శుభ్రం చేయించారు. గుంతలు పూడ్చడం, ఆయిల్‌బాల్స్ వేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, వార్డు అధికారులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, ఆర్పీలు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: సాయుధపోరాటం చేసిన దొడ్డి కొమురయ్య గొప్ప యోధుడని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, క్రీడల శాఖ అధికారి సురేశ్ తదితరులున్నారు.

సింగరేణిలో ఫైనాన్స్ అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా 21మంది ఫైనాన్స్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. భూపాల్‌పల్లిలో పనిచేస్తున్న సురేఖను ఆర్జీ–3 ఫైనాన్స్ డీజీఎంగా బదిలీ చేశారు. ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న పి.మోహన్‌రావును భూపాల్‌పల్లి, కె.శ్రీహర్షను ఆర్జీ–3, ఇ.నరేశ్‌ను భూపాల్‌పల్లి, ఎస్.శిరీషను ఆర్జీ–2, ఎస్.గణేశ్‌ను కార్పొరేట్, వై.శశాంక్‌ను బెల్లంపల్లి, సీహెచ్.మౌనికను ఎడ్యుకేషన్ సొసైటీ, జి.నితిన్‌కుమార్‌ను భూపాల్‌పల్లి, చింత మౌనికను కొత్తగూడెం, ఎస్.సౌమ్యను ఆర్జీ–1 ఏరియాకు బదిలీ చేశారు. అదేవిధంగా సూర్యతేజను హైదరాబాద్, వి.శ్రావికను కార్పొరేట్, రమాకాంత్‌ను కార్పొరేట్, మల్లికార్జున్‌ను సీఎస్ఆర్ సెల్, రాజ్‌కుమార్‌ను మందమర్రి, గోపిని ఈఆర్పీ, లక్ష్మీ ప్రసన్నను ఫైనాన్స్ కార్పొరేట్, జగదీశ్‌ను ఇల్లెందు, ఝాన్సీరాణిని ఫైనాన్స్ కార్పొరేట్, కె.శ్రీనివాసరావును ఫైనాన్స్ కొత్తగూడెం బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చారు. వీరందరూ ఈనెల 12వ తేదీలోగా ఆయా పోస్టుల నుంచి రిలీవ్ అయి బదిలీ అయిన స్థానాల్లో రిపోర్టు చేయాలని సింగరేణి యాజమాన్యం ఆదేశించింది.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీసా అర్జున్‌రావు, రాష్ట్ర నాయకుడు చింతల లింగారెడ్డి, సురేశ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కడారి అశోక్‌రావు, మహేందర్‌యాదవ్, కామణి రాజేంద్రప్రసాద్, మిట్టపల్లి ప్రవీణ్, చాతరాజు రమేశ్, కొల్లూరి సతీశ్‌కుమార్, కోట నాగేశ్వర్, కొమ్ము తిరుపతియాదవ్, నిర్మలగౌడ్, వనజ, సత్యనారాయణ, రాజన్న పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

జూలపల్లి: బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలకు వివరించాలని, స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కి, నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. నాయకులు కంది చొక్కారెడ్డి, మీసారపు వెంకటేశం, లోక రవీందర్‌రెడ్డి, తమ్మడవేని మల్లేశం, పొలగాని సతీశ్, పూరెల్ల గంగయ్య, సంకెన్ల లక్ష్మన్, కన్నం రమేశ్, నిట్టు కొమురయ్య, మడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగివచ్చేలా చేస్తాం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగివచ్చి సమస్యలు పరిష్కరించేలా చేస్తామని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. జీడీకే–2వ గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈనెల9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. జేఏసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, మిర్యాల రాజిరెడ్డి, ఆరెపల్లి శ్రీనివాస్, మెండె శ్రీనివాస్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పాల్గొనాలి

జ్యోతినగర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కేంద్ర కార్మికశాఖ అధికారి యూసుఫ్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఆర్.లక్ష్మణ్, సత్యం, పుల్లూరి నాగభూషణం, నాయకులు చింతల సత్యం, రాజమల్లయ్య ఉన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేటు లేకపోతే చర్యలు

జ్యోతినగర్: వాహనాలకు నంబర్ ప్లేటు లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ అన్నారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నంబర్ ప్లేటు లేని వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబరు ప్లేటు సరిగా లేని వాహనాల్ని గుర్తించేందుకు పోలీసులు స్పెషల్‌డ్రైవ్ చేపట్టారన్నారు. తనిఖీల్లో 30 వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ఎన్టీపీసీ రామగుండంలో రక్తదాన శిబిరం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో ఎల్అండ్‌టీ కంపెనీ సహ వ్యవస్థాపకుడి జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని లక్ష్మీమోహన్‌రెడ్డి, జయవీర్ పాండ్యన్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లాశాఖ నిర్వహణ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ హాజరయ్యారు. 30మంది రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. భద్రతా అధికారి అభిషేక్, ప్రాజెక్ట్ ఇంచార్జిలు అనంత్ సేతురామన్, విజయకుమార్, అనిల్, రాజ్‌కుమార్, శశి పాల్గొన్నారు.

నేడు మదర్‌థెరిస్సాలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ప్లేస్‌మెంట్ బ్రోచర్‌ను శుక్రవారం ఆయన ఏవో పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఫాక్స్‌కాన్, రైటర్ తేజస్ నెట్‌వర్క్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా టెలిసర్వీస్, టీంలీస్, జెన్ టెక్నాలజీస్, ప్రీమియర్ ఎనర్జీ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

ఖాతాదారులకు సరైన సేవలు అందించాలి

గోదావరిఖనిటౌన్: బ్యాంకులు ఖాతాదారులకు సరైన సేవలు అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. నగరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని ఏటీఎంను ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం అపర్ణారెడ్డి, ఏజీఎం రాధాకృష్ణ, ఎల్‌డీఎం వెంకటేశ్, బ్యాంక్ మేనేజర్‌లు నిషాంత్‌జా, నిరంజన్ ప్రసాద్, భీమేష్, గోపీకృష్ణ, విష్ణుకుమార్, వెంకట్, మురళి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాల సమస్య పరిష్కరించాలని శుక్రవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ వినతిపత్రం అందించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు, అలవెన్స్‌లు, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. బత్తుల రామన్న, బురం ప్రసాద్, పెంట వేంకటేశ్, క్రాంతి పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ హెచ్చరించారు. దుకాణాల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికే చెత్త అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. శుక్రవారం రోడ్డుపై చెత్త వేసిన వ్యాపారికి రూ.3వేల జరిమానా విధించినట్టు జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

వర్షాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

గోదావరిఖని: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని సింగరేణి ఆరోగ్యాధికారి డాక్టర్ కె.పద్మ కోరారు. శుక్రవారం జీడీకే–2ఏ గనిలో కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల నుండి సంక్రమించే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు సహకరించండి

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాపారులు తమవంతు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ ఆఫీసులో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్‌కిషోర్ శారద సహా పలువురు వ్యాపారులతో శుక్రవారం సమావేశమై పలు సూచనలు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రాగినేడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సేవలందించారు. డాక్టర్లు శ్రావణ్, స్వాతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెండోరోజు విద్యాసంస్థల బంద్

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సంస్థల సమస్యలు పరిష్కరించాలంటూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శుక్రవారం కొనసాగింది. నాయకులు నరేశ్‌రత్న, సుప్రజ, రమ్య, సురేఖ, గీతాంజలి, మేఘన, రవళి, అలేఖ్య, గీత, మహేశ్వరి, రాణి, వాణి ఉన్నారు.

మడేలేశ్వరస్వామి బోనాలు



బోనాలతో రజక కులస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్లగ్రామంలో శుక్రవారం రజక కులస్తుల నేతృత్వంలో మడేలేశ్వర స్వామి బోనాలు వైభవంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి బోనాలు నైవేద్యాలు సమర్పించారు. మాజీ జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచ్‌లు దాసరి లావణ్య, రమేశ్, శ్రీదేవి, రాజు పాల్గొన్నారు.

కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐపై సీలింగ్ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

జ్యోతినగర్: కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐపై సీలింగ్ ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రూ.26వేల కనీస వేతనం నిర్ణయించాలని కోరారు. 9న జరిగే సమ్మెలో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరం నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, ఎండీ జమీల్, ఇజ్జగిరి భూమయ్య, శ్రీనివాస్, గీట్ల లక్ష్మారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• సమ్మె కరపత్రాల పంపిణీ

రామగుండం: దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సమ్మెలో భాగంగా ఆయిల్ సెక్టార్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం కుందనపల్లి రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఇంధన నిల్వల డిపోల వద్ద సమ్మె కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. సీఐటీయూ ప్రతినిధులు ఎం.రామాచారి, ఆలేటి మోహన్ ఉన్నారు.

• ట్రాక్టర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

రామగుండం: అంతర్గాం మండల ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఆలకుంట మల్లేశ్, ఉపాధ్యక్షులు బాణాల కార్తీక్, ఆలకుంట రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఒల్లెపు సారయ్య, కోశాధికారులు తాపల్ల రవి, లోకిని వెంకటేశ్, కార్యదర్శులు రాపాక సమ్మయ్య, ఆలకుంట అశోక్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు సుభాష్ అభినందించారు.

• మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని రామారావుపల్లిలో శుక్రవారం బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎస్సై స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• స్వామి వివేకానంద వర్ధంతి

గోదావరిఖనిటౌన్: స్థానిక రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో శుక్రవారం స్వామి వివేకానంద వర్ధంతి నిర్వహించారు. పాఠశాలలోని వివేకానంద విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీబీజీకేఎస్ నాయకులు వడ్డేపల్లి శంకర్, ఎడిటర్ రామకృష్ణ కిషోర్‌యాదవ్, ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు దాసరి స్వప్న మహేశ్ పాల్గొన్నారు.

• మహిళల భద్రత షీటీంతోనే సాధ్యం

రామగుండం: మహిళల భద్రత షీటీంతోనే సాధ్యమవుతుందని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 6303923700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

• సీసీరోడ్డు పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయం నుంచి వ్యవసాయ కార్యాలయం వరకు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డును మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, సబ్బని రాజమల్లు, మాజీ ఎంపీటీసీ సదానందం, నాయకులు రమేశ్, సతీశ్, శివరామకృష్ణ, రవి, రామచంద్రారెడ్డి, కృష్ణ, మొండయ్య, సురేశ్, రమేశ్, ప్రేమ్‌సాగర్, రామచంద్రం పాల్గొన్నారు.

• స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

ఎలిగేడ: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూస్ అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం, మంగళవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఎంపీవో కిరణ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సంధ్య, డ్రిడ్ ఏఈ శ్రావణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

• సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంథనిరూరల్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రతీ ఒక్కరు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంథని ఎంపీడీవో శశికళ సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం మంథని మండలం బెస్తపల్లిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. బెస్తపల్లి, దుబ్బపల్లి, చిల్లపల్లిలోని నర్సరీలను పరిశీలించారు. ఏపీవో సదానందం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్, సెక్రటరీ రేణుక పాల్గొన్నారు.

• బాల కార్మికులను పనిలో చేర్చుకోవద్దు

సుల్తానాబాద్: బాల కార్మికులను పనిలో చేర్చుకోవద్దని సుల్తానాబాద్ ఎస్సై వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఎస్ఐ రత్నాకర్, జమున, రేణుక, హెచ్‌వోసీ కుమారస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు ఉన్నారు.

• రేపు వివేక్‌కు ఆత్మీయ సన్మానం

గోదావరిఖని: కార్మిక మంత్రి వివేక్‌కు ఈనెల 6న స్థానిక ఆర్కేగార్డెన్‌లో ఆత్మీయ సన్మానం నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు బాబర్ సలీంపాషా, గుమ్మడి కుమారస్వామి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

• కేజీవీల్స్‌తో రోడ్డుపైకి వస్తే చర్యలు

సుల్తానాబాద్: రోడ్డుపై కేజీవీల్స్‌తో వెళ్తే చట్టరీత్యా చర్యలతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్‌కు చెందిన భూతగడ్డ చంద్రయ్య శుక్రవారం కేజీవీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపై నడపగా పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించగా రూ.5వేల జరిమానా విధించారు. మళ్లీ పట్టుబడితే వాహనం సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

• బీఎల్వోలదే కీలకపాత్ర

ఎలిగేడు: ఎన్నికల నిర్వహణలో బీఎల్వోలదే కీలకపాత్ర అని తహసీల్దార్ యాకన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ నల్ల రాజేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

• బిల్డింగ్‌పై నుంచి పడి వృద్ధురాలు మృతి

గోదావరిఖని: స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు తాటికొండ కనకమ్మ(105) శుక్రవారం రెండస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. తలకు బలమైన గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

హామీలు అమలు చేసి ఓట్లడగాలి



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

రామగుండం: అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడగాలని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. పొట్యాలలో శుక్రవారం తెలంగాణకు కేసీఆర్ పాలన శ్రీరామరక్ష అనే కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ 420 హామీలిచ్చి ఓటర్లను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకం అందించడం ఆయనతోనే సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి, మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, గోపు అయిలయ్యయాదవ్, బొండ్ల అశోక్, సందెల మల్లయ్య, బండారి ప్రవీణ్, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవారాహిదేవి నవరాత్రి ముగింపు ఉత్సవాలు



గోరింటాకు మహోత్సవంలో భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివాలయంలో ఉన్న శ్రీవారాహిదేవి గుప్త నవరాత్రి ముగింపు ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఆలయం ఆవరణలో మహిళా భక్తులు కుంకుమ పూజలు, గోరింటాకు మహోత్సవం, అభిషేకం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత

సుల్తానాబాద్: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్, వార్డుల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న పీఈటీ, హెచ్‌ఎం

పాలకుర్తి: బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రియాంక కుమారి, సిరి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. గతనెల 29న సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రియాంక కుమారి, సిరి పాల్గొని 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్‌లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈనెల 6న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ మహేందర్, హెచ్‌ఎం ప్రేమానందం, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్‌వోసీ అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన నగునూరి అనిల్ కొన్నిరోజుల నుంచి మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యఖర్చుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల విలువ గల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. కాగా మంత్రి పీఏ శుక్రవారం అనిల్‌కు అందజేశారు.

కస్తూర్బా విద్యాలయం తనిఖీ



భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో

ధర్మారం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. వంటశాలలో తయారు చేసిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దాలి

ఓదెల: కొత్త ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని ఆర్డీవో గంగయ్య ఆదేశించారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో మృతిచెందిన ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. ఓటరు లిస్టులో తప్పులుగా ఉన్న వాటిని సరిదిద్దాలన్నారు. ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తహసీల్దార్ దీరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.